క్లుప్తంగా...

నేడు తాగునీటి సరఫరా బంద్

సికింద్రాబాద్: ఆలుగడ్డబావి రైల్వే వంతెన వద్ద అత్యవసర పైప్‌లైన్ పనులు చేపడుతున్న కారణంగా ఈ నెల 27న సీతాఫల్‌మండీ, మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు జల మండలి డీజీఎం వై.కృష్ణ తెలిపారు. రోజంతా పనులు చేపడుతున్న కారణంగా రైల్‌కల్యాణ్, దాదర్‌కాంపౌండ్, ప్రగతి స్కూల్ లేన్, గణేశ్ టెంపుల్, దూద్‌బావి, సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్, బసవతారకనగర్, రామాలయం వీధి, మేడిబావి, టీఆర్‌టీ క్వార్టర్స్, నామాలగుండు పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 19, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 32, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 14, క్యారెట్ 40, దొండ 13, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 19, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 10, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6 ప్రకారం ధర పలుకుతున్నాయి

ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయంలో బీఆర్‌ఎస్ యువజన నాయకుడు తలసాని సాయి కిరణ్ యాదవ్, మహిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ దంపతులు వివాహ వార్షికోత్సవం కావడంతో వారు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈ దంపతులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు జగదీష్ వర్మ, కేఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

సనత్‌నగర్: చిన్నారులు తమ కెరీర్‌ను ఉన్నతంగా మలచుకునేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని బేగంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. అప్సా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట పాటిగడ్డ ఎల్‌బీఎస్‌నగర్‌లో నిర్వహించిన ఐదు రోజుల సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ శిబిరం ద్వారా గణితం, విజ్ఞానశాస్త్రం, మ్యాజిక్ షో, ఇండోర్ గేమ్స్, గ్రూప్ యాక్టివిటీ, డ్రాయింగ్, వ్యాసరచన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కబబర్చిన చిన్నారులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చిన్నారులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడాంశాల్లో కూడా శిక్షణ పొందడం ద్వారా మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అప్సా కో ఆర్డినేటర్ బస్వరాజ్, ఎఫ్ఏ శోభ, రాజేశ్వరి, మహిళా మండలి కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రికి ఆహ్వానం




చిక్కడపల్లి: నూతన గ్రంథాలయ భవన భూమిపూజకు రావాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదల చేస్తున్న క్రమంలో పోటీపరీక్షల అభ్యర్థుల సౌకర్యార్థం కొత్త పుస్తకాలను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీసిన పూడిక రోడ్డుపైనే వదిలేస్తే ఎలా?

- ఓపెన్ నాలాలో పేరుకుపోయిన పూడిక
- తీసిన వ్యర్థాలు రోడ్డుపైనే వదిలేస్తున్న వైనం
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



నాలా పక్కన పేరుకుపోయిన పూడిక మట్టి కుప్పలు



ఇందిరానగర్‌లో ఓపెన్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధి లాలాపేటలోని ఓపెన్ నాలాలో ఇటీవల జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పూడిక తీత పనులు చేపట్టారు. నాలా లోంచి తీసిన వ్యర్థాలతో కూడిన మట్టిని రోడ్డు పొడవునా గుట్టలుగా పోసి చాలా రోజులుగా అలానే వదిలేశారు. అవికాస్తా ఎండకు ఎండి రోడ్డంతా విస్తరిస్తున్నాయి. – లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీ, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాలకు నిత్యం ఇదే దారి గుండా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పైపైనే తీసి వదిలేశారు...

లాలాపేట చంద్రబాబునగర్ నుంచి శ్రీపురి కాలనీ, ఇందిరానగర్, సత్యానగర్, వినోభానగర్ తదితర ప్రాంతాలను కలుపుతూ దాదాపు కిలో మీటరు దూరం ఉన్న ఓపెన్ నాలాలో పూడిక సరిగా తీయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలాల్లో అక్కడక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనం ఇస్తున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా సదరు కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పూడిక పనులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పొంచి ఉన్న వరద ముప్పు...

ఏటా వర్షా కాలంలో ఓపెన్ నాలా పరీవాహక ప్రాంతాలైన లాలాపేటలోని లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, శ్రీపురి కాలనీలకు వరద ముప్పు పొంచి ఉంది. ఇటీవల ఎండా కాలంలో కురిసిన వర్షాలకే సత్యానగర్‌లోని పలు ఇళ్లలోకి వరద చేరి ఇంట్లోని వస్తువులన్నీ తడిసాయి. వర్షాకాలంలో చెప్పనవసరం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ఓపెన్ నాలాల్లో పూడిక పనులు సక్రమంగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఏటా లక్షల రూపాయలు వెచ్చించి చేపడుతున్న పూడిక పనుల్లో అధికారుల పర్యవేక్షణ తప్పకుండా ఉండాలంటున్నారు.

సీతాఫల్‌మండీ సర్వతోముఖాభివృద్ధికి కృషి



మహ్మద్‌గూడలో సీవరేజి లైన్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండీ డివిజన్‌లో త్వరలో భారీగా అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ చెప్పారు. శుక్రవారం సీతాఫల్ మండీ డివిజన్ పరిధిలో రూ. 1.10 కోట్ల వ్యయంతో సీవరేజి, తాగునీటి పైప్‌లైన్ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ... ఐదు దశాబ్దాలుగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టని అభివృద్ధి పనులను టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎనిమిదేళ్లలో పూర్తి చేస్తున్నామని చెప్పారు. సీతాఫల్‌మండీలో కోట్లాది రూపాయల వ్యయంతో పాఠశాల, కళాశాలలు, ఆస్పత్రి నిర్వహణ కోసం అధునాతన భవన సముదాయాలు నిర్మించనున్నామన్నారు. కొద్ది రోజుల్లో సదరు భవనా నిర్మాణం పనులకు ప్రారంభోత్సవాలు చేస్తామన్నారు. సీవరేజి, వాటర్‌లైన్ల నిర్మాణం పనులు పూర్తి చేసిన వెంటనే అంతర్గత రహదారుల నిర్మాణ పనులు పూర్తిచేయించేందుకు అధికారులను అప్రమత్తం చేశామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ నవ్య, బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్‌కుమార్‌గౌడ్, బండారు మహేందర్‌ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోమాత పుట్టినరోజు వేడుకలు



గోపూజ మహోత్సవానికి హాజరైన తులసి ఫౌండేషన్ అధ్యక్షుడు శివకుమార్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఈశ్వరయ్య నిలయంలో శుక్రవారం గోమాత పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వంశీకృష్ణ అనే యువకుడు తాను పెంచుకుంటున్న గోవు శ్రీగంగ మొదటి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోపూజ మహోత్సవానికి తులసీ ఫౌండేషన్ అధ్యక్షుడు, గో సంరక్షణ సమితి నాయకుడు శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ... గోవుల సంరక్షణ కోసం తులసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. హిందువులంతా ఇంటింటికీ ఒక గోవును పెంచుకోవాలని సూచించారు. గో సంరక్షణ ద్వారా చేకూరే లాభాలను ఆయన వివరించారు. గోపూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, గరికపోగుల చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించండి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాల రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. శుక్రవారం వర్సిటీల కాంట్రాక్టు టీచర్ల జేఏసీ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ మా బాధలను ఆలకించి... మా కుటుంబాలు, పిల్లల భవిష్యత్తును ఆలోచించి మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని సీఎం కేసీఆర్‌ను వేడుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఎదురు చూడగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్ కాలేజీల అధ్యాపకుల ఉద్యోగులను పర్మినెంట్ చేసి కేవలం వర్సిటీ ఉద్యోగులను మాత్రమే విస్మరించడం దారుణమన్నారు. వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేస్తే ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక ఉండదన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురామ్, డాక్టర్ రామేశ్వర్‌రావు, డాక్టర్ వేల్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



మనోజ్ కుమార్

అడ్డగుట్ట: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సమాచారం మేరకు... ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌కు చెందిన మనోజ్‌కుమార్(37) ప్రైవేటు ఉద్యోగి. గురువారం ఉదయం ఉద్యగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మనోజ్ రాత్రైన తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్నేహితులు, తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితంల లేదు. దీంతో శుక్రవారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు.

త్వరలో మరో రెండు బస్తీ దవాఖానాలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బస్తీ దవాఖానాల జోరు నడుస్తోంది. స్థానికుడైన తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ చొరవతో అన్ని వార్డుల్లో బస్తీ దవాఖానాల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇటవలే ఆరో వార్డు నందమూరి నగర్‌లో, ఎనిమిదో వార్డు లోటుకుంటలో రెండు బస్తీ దవాఖానాలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఐదోవార్డు గాంధీ నగర్లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాల్సిందిగా స్థానికులు ఎర్రోళ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అధికారులు గతంలోనే అనుమతులు ఇచ్చారని, త్వరలోనే అక్కడ బస్తీ దవాఖానా ఏర్పాటు చేస్తామని ఎర్రోళ్ల వారికి హామీ ఇచ్చారు. ఇక నాలుగో వార్డు పరిధిలోనూ బూసారెడ్డి గూడలోని బీఆర్. అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ ఆవరణను బస్తీ దవాఖానాకు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖరరెడ్డి, సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదితతో కలిసి సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అధికారుల పరిశీలన అనంతరం బస్తీ దవాఖానా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, ముప్పిడి మధుకర్, పెద్దాల నర్సింహ, సదానంద్‌గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సనత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతీనగర్ వివేకానందనగర్ కాలనీ ప్రాంతంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి నిర్జీవంగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బందితో కలిసి పోలీసులు అక్కడికి చేరుకుని పరీక్షించగా సదరు వ్యక్తి అప్పటికే మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు చొక్కా, గోధుమ రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: భార్యతో గొడవపడిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ ఎస్‌ఆర్‌ఆర్‌పురానికి చెందిన మీర్జా సలీంబేగ్ (50), భార్య షాకీరబేగం భార్యాభర్తలు. భార్య షాకీరబేగం కుట్టు పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా సలీంబేగ్ మాత్రం ఖాళీగా ఉన్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి భార్యతో ఘర్షణ పడిన మీర్జా సలీంబేగ్ తమ ఇంటికి, మరో ఇంటికి మధ్య ఉన్న చిన్న సందులో మెడకు కేబుల్ తీగ చుట్టుకుని గోడ మీద నుంచి దూకాడు. దీంతో మెడకు ఉచ్చు బిగి మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అతికష్టం మీద బయటకు వెలికితీశారు. కేసు నమోదు చేసుకుని ఎస్సార్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మహిళా సాధికారతే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తోందని శ్రీగణేశ్ అన్నారు. శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేశారు. కంటోన్మెంట్ ఐదో వార్డు గాంధీ నగర్‌లో లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. స్థానిక మహిళలు కోరిన వెంటనే చిత్తశుద్ధితో వారికి వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించామన్నారు. శిక్షణతోనే వదిలేయకుండా వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామన్నారు. ఇదివరకే పలువురు మహిళలకు అప్పడాల తయారీ శిక్షణ, యంత్రాలు పంపిణీ చేశామన్నారు. తాజాగా కుట్టు మెషీన్ల పంపిణీతో పదుల సంఖ్యలో మహిళలు ఆర్థిక సాధికారత సాధించే అవకాశం కలుగుతుందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని బస్తీల్లోనూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామని, స్థానికులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, గౌతమ్, విక్కి, భాస్కర్ గౌడ్, రాజేష్, భిక్షపతి, సునీత తివారి, సంతోషి, సంధ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, మెరుగుదలపై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఎవర్‌కేర్ గ్రూప్ సీఈవో మాసిమిలియానో, డాక్టర్లు

వెంకటేశ్వరకాలనీ: ప్రముఖ వైద్య రంగ సంస్థ ఎవర్‌కేర్ గ్రూప్ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణలో నాణ్యత, మెరుగుదల లక్ష్యంగా తొలి ఆరోగ్య సదస్సును గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు బంజారాహిల్స్‌లో విజయవంతంగా నిర్వహించింది. ఆరోగ్య సంరక్షణ అంశంలో అంతర్ దృక్కోణాన్ని ఆవిష్కరించడం, పరస్పర అభిప్రాయాలు పంచుకోవడం ద్వారా ఈ విభాగంలో అత్యుత్తమ ఫలితాలను సాధించే దిశలో ఈ సదస్సు కొనసాగింది. ఆరోగ్య విభాగంతో పాటు వివిధ రంగాల నుంచి దాదాపు 400 మంది సదస్సులో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 50 అప్‌స్టాక్ట్ సమర్పణలు, 35 పోస్టర్లు, 20 నాణ్యత మెరుగుదల ప్రాజెక్టులను వైద్య, వైద్యేతర రంగాల వ్యక్తులు సమర్పించారు. సందేశాత్మక ఉపన్యాసాలు, ఆకర్షణీయమైన గోడ పత్రికల ఆవిష్కరణలతో శుక్రవారం సదస్సు ముగిసింది. ముగింపు కార్యక్రమలంలో ఎవర్ గ్రూప్ సంస్థ సీఈవో మాసిమిలియానో మాట్లాడుతూ రోగికి అవసరమైన సానుకూల ఫలితాలకు ప్రాధాన్యతనిచ్చే సమగ్ర విధానాన్ని తాము ఈ సదస్సు ద్వారా నిర్ధారించామన్నారు. సదస్సులో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, భారత్‌తో పాటు కెన్యా, నైజీరియా దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



వైద్య సిబ్బందికి నియామకపత్రాన్ని అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటి

రాంగోపాల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ వైద్య సిబ్బందిని రెగ్యులరైజ్ చేసిన సందర్భంగా శుక్రవారం ప్యాట్నీ సెంటర్‌లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలకు డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ సర్వీసెస్ పైన, కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి కృషి చేయడం, ప్రతీ సంవత్సరం మలేరియా, డెంగీ వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు ఎంతో కృషి చేయడంలో కాంట్రాక్ట్ వైద్య సిబ్బంది ఎంతో శ్రమించారని తెలిపారు. ఇప్పటి నుంచి మరింత కష్టపడుతూ పేద ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలలో పాల్గొని సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. అనంతరం, రెగ్యులరైజ్ అయిన సిబ్బంది మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తమ కుటుంబాల్లో ఆనందాన్ని, వెలుగులను నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, నిరంజన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి

- సాయన్న ఆశయాలకు అనుగుణంగా పనులు
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయాలకు అనుగుణంగా కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్ పరిధిలోని సిరిపురంలో రూ. 12 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దివంగత ఎమ్మెల్యే సాయన్న ప్రతిపాదించిన రూ. 10 కోట్ల మేర పనులు వివిధ దశలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆయా పనులన్నింటినీ వీలైనంత త్వరలో పూర్తి చేస్తామన్నారు. అదే సమయంలో నియోజకవర్గంలో కొత్తగా చేపట్టాల్సిన పనులతో పాటు పూర్తిస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగేలా చూస్తామన్నారు. పార్టీ పరంగా ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి, మరో పక్క సాయన్న కుమార్తెలు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, బోర్డు మాజీ సభ్యులు అంతా ఒక్కటిగా పనులు చేపడుతున్నట్లుగా తెలిపారు. మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి చొరవతో నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో కొత్తగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ ముకుంద రెడ్డి, ఈఈ సుదర్శన్, సీజీఎం ప్రభు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏడీఈ జగదీష్, హార్టికల్చరల్ అధికారి గణేశ్, ఏఈ భరత్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ముప్పిడి మధుకర్, సదానంద్ గౌడ్, పనస సంతోష్, తేజ్‌పాల్, పిట్ల నాగేశ్, అజయ్, నాగినేని సరిత, శర్విన్, శ్రీహరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. కమిషన్‌కు పాలకవర్గం లేనందున దళితులు తమకు ఎదురవుతున్న సమస్యలను ఎవరికి వివరించాలో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. శుక్రవారం మాల మహానాడు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు గతంలో నియమించిన కమిటీ కాలపరిమితి పూర్తయిందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, అణిచివేత చర్యలు, లైంగిక దాడులు, కుల వివక్ష, గ్రామాల నుంచి బహిష్కరణ వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. దళితులు గిరిజనులు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సభ్యులకు విన్నవించాలనుకుంటున్న క్రమంలో కమిషన్‌కు పాలకమండలి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

పార్లమెంటు నూతన భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి

పంజగుట్ట: భారత పార్లమెంటు నూతన భవనానికి రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేరు పెట్టాలని, పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా నిర్వహించాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సీఎం కేసీఆర్ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అలాగే పార్లమెంటు భవనానికి కూడా అంబేడ్కర్ పేరు పెట్టాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగం వల్లే తాను ప్రధాని అయ్యానంటూ మోదీ ప్రధాని అయ్యాక స్వయంగా చెప్పిన విషయాన్ని ఆయన ఉదహరించారు. గిరిజన బిడ్డతో పార్లమెంటు ప్రారంభించకపోతే అణగారిన వర్గాలను, రాజ్యాంగాన్ని అవమానించినట్లే అవుతుందన్నారు. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు, నేతలు కోలా శ్రీనివాస్, సంజీవ్ నాయక్, గుంటి మంజుల, దండుగుల రామకృష్ణ, ఓదెలు పాల్గొన్నారు.